సాక్షి
సిద్దిపేట
మంగళవారం । 26 । ఆగస్టు । 2025


మిరుదొడ్డిలో యూరియా కోసం ఆందోళన చేస్తున్న రైతులు

న్యూస్‌రీల్

మల్లన్న ఆలయ అభివృద్ధికి కృషి

రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్


లక్ష్మణ్‌కు వినతి పత్రం అందిస్తున్న ఈఓ అన్నపూర్ణ

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ తెలిపారు. సోమవారం కుటుంబ సమేతగా స్వామి వారిని దర్శించుకున్నారు. అంతకు ముందు ఆలయ అధికారులు, అర్చకులు ఎంపీకి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఆలయాలకు అందిస్తున్న ప్రసాదం పథకంలో కొమురవెల్లి ఆలయాన్ని చేర్చాలని ఈఓ అన్నపూర్ణ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రసాదం పథకంలో మల్లన్న ఆలయాన్ని చేర్చి అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రైల్వే స్టేషన్ పనులు చివరి దశకు చేరుకున్నాయని త్వరలోనే ప్రారంభించి భక్తులకు ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. ఎంపీ నిధుల నుంచి ఆలయ ఆవరణలో అతిథి గృహం నిర్మించడానికి ప్రణాళిక, ప్రతిపాదనలు తయారు చేయించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జనగామ, సిద్దిపేట బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అదనపు డీసీపీగా కుశల్కర్


అనురాధకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కుశల్కర్

సిద్దిపేటకమాన్: నూతన అదనపు డీసీపీ (అడ్మిన్)గా సీహెచ్ కుశలకర్ సోమ వారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు పోలీసు కమిషనర్ కార్యాలయంలో సీపీ అనురాధను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఏసీపీ రవీందర్‌రెడ్డి, ఏసీపీ నరసింహులు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి గణపయ్యనే ప్రతిష్ఠిద్దాం

- పర్యావరణాన్ని కాపాడుదాం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శంకర్


మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న బైరి శంకర్ తదితరులు

గజ్వేల్‌రూరల్: మట్టితో తయారు చేసిన గణపయ్యలను ప్రతిష్ఠించి పూజించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ అన్నారు. బీజేపీ నాయకులు, టెలికం బోర్డు సభ్యుడు కమ్మరి శ్రీను ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ఎదుట మట్టి గణపయ్యల విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి గణపయ్యల విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల చెరువులు కలుషితమై అందులోని జలచరాలకు ముప్పు వాటిల్లే ప్రమాదముందన్నారు. ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎల్లు రాంరెడ్డి, పట్టణశాఖ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్, బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు శివకుమార్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పేర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయండి


మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

దుబ్బాక: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ దుబ్బాక నగర కార్యదర్శి జశ్వంత్ డిమాండ్ చేశారు. సోమవారం దుబ్బాకలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. లక్షలాది పేద విద్యార్థులు పైచదువులకు పోకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు అడ్డుపడుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అఖిల్, శేషాంక్, రాజు, దిలీప్, రాకేశ్ ఉన్నారు.

యూరియా కోసం అలసి.. సొలసి


మిరుదొడ్డి రైతు వేదిక వద్ద అలసిన మహిళా రైతు

యూరియా కొరత రైతులను పట్టి పీడిస్తోంది. బస్తా యూరియా కోసం రైతులు రాత్రనక పగలనకా పడిగాపులు పడుతున్నారు. మిరుదొడ్డికి యూరియా లారీ వస్తుందన్న సమాచారంతో రైతులు సోమవారం తెల్లవారుజాము నుంచే రైతు వేదిక వద్దకు చేరుకున్నారు. అలసి సొలసిన కొందరు అక్కడే కునుకు తీశారు. తీరా యూరియా రావడం లేదని తెలియడంతో ఆగ్రహావేశాలకు లోనయ్యారు. దీంతో రోడ్డుపై బైఠాయించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం రెండు యూరియా లారీలను తెప్పించి పంపిణీ చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. దుబ్బాక వ్యవసాయ సహకార సంఘం ఎదుట ఆదివారం అర్ధరాత్రి నుంచే రైతులు క్యూ కట్టారు. మద్దూరు మండలం రేబర్తి సొసైటీ వద్ద జరిగిన యూరియా పంపిణీలో తోపులాట చోటుచేసుకుంది. పోలీసుల పహారాలో అందించారు. చిన్నకోడూరు, బెజ్జంకి, చేర్యాల, కొండపాక తదితర మండలాల్లోనూ ఇదే దుస్థితి.

– మిరుదొడ్డి(దుబ్బాక)/ మద్దూరు(హుస్నాబాద్)/ చిన్నకోడూరు/బెజ్జంకి/చేర్యాల(సిద్దిపేట):


బెజ్జంకిలోని సహకార సంఘం ఎదుట బారులు


రేబర్తి సొసైటీ కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న పోలీసులు


చిన్నకోడూరులో యూరియా కోసం రైతుల బారులు

రెండు రోజులుగా జ్వరం..అయినా..



సంచి యూరియా కోసం నాలుగు రోజుల నుంచి తిప్పలు పడుతున్నా. అయినా దొరకడంలేదు. నాకు బీపీ, షుగర్ ఉంది. పైగా రెండు రోజులుగా జ్వరం. గంటల కొద్దీ నిరీక్షించడంలో ప్రాణం ఆగమవుతోంది. జర యూరియా అందించి పుణ్యం కట్టుకోండి.

– కనకవ్వ, మహిళా రైతు, అందె, మిరుదొడ్డి

ఊరూ వాడ.. డెంగీ దడ


సిద్దిపేట జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులు

జిల్లాలో డెంగీ పంజా విసురుతోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు 28 కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఎక్కడికక్కడా నీటి నిల్వలు ఏర్పడ్డాయి. దీంతో దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇటీవల జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్‌లో ఇద్దరు యువకులు డెంగీ బారిన పడి మృతిచెందిన విషయం విదితమే. దీంతో జిల్లావాసుల్లో ఆందోళన నెలకొంది.

– సాక్షి, సిద్దిపేట

- రోజురోజుకూ పెరుగుతున్న బాధితుల సంఖ్య
- ఈ ఏడాది ఇప్పటి వరకు 28 కేసులు
- తిమ్మాపూర్‌లో ఇటీవల ఇద్దరు మృతి
- గ్రామీణప్రాంతాల్లోనే అత్యధికంగా వ్యాప్తి
- ఆందోళన చెందుతున్న ప్రజలు

వానాకాలం.. వ్యాధుల కాలం. వర్షాలు కురిసిన తర్వాత నీరు నిలిచి ఉండంతో వ్యాధులు విజృంభిస్తున్నాయి. పీహెచ్‌సీ, జిల్లా ఆస్పత్రి, జీజీహెచ్‌లకు, ప్రైవేట్ ఆస్పత్రులకు జ్వర పీడితుల తాకిడి పెరిగింది. ఈ నెలలో ఇప్పటి వరకు 16 డెంగీ కేసులు నమోదయ్యాయని ప్రభుత్వ వైద్యారోగ్య శాఖ గణాంకాలు చెప్పుతున్నాయి. అయితే ప్రైవేట్ ఆస్పత్రుల్లో వీటి సంఖ్య లెక్కేలేదు. జ్వరం రాగానే స్థానికంగా ఉండే ఆర్‌ఎంపీలను సంప్రదిస్తున్నారు. దీంతో పలువురు ఆర్‌ఎంపీలు హైడోస్ ఇంజక్షన్లు, మందులు ఇస్తుండటంతో ప్రాణాలమీదకు వచ్చిన సంఘటనలూ ఉన్నాయి.

ఒక్క నెలలోనే 16 కేసులు

ఒక్క ఆగస్టు నెలలోనే 16 మంది డెంగీ బారిన పడ్డారు. ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లోనే కేసులు నమోదు అవుతున్నాయి. తిగుల్ పీహెచ్‌సీ పరిధిలో 4, మిర్జాపూర్ 5, నాసర్‌పూర 3, రాజగోపాల్‌పేట 2, వర్గల్ 2, కుకునూరుపల్లి 2, ములుగు 2, మిగతా చోట్ల ఒక్కొక్కటి చొప్పున కేసులు నమోదయ్యాయి.

శాఖల మధ్య సమన్వయ లోపం


జగదేవ్‌పూర్‌లో నిలిచిన వర్షపు నీరు


పారిశుద్ధ్య నిర్వహణను వైద్య, ఆరోగ్య శాఖ, మున్సిపల్, పంచాయతీ శాఖల సమన్వయంతో చేపట్టాల్సి ఉంటుంది. వర్షా కాలానికి వారం రోజుల ముందే సమావేశం ఏర్పాటు చేసుకొని తగిన ప్రణాళికలను రూపొందించుకోవాల్సి ఉంది. డ్రైనేజీల శుభ్రత, పైప్‌లైన్ల లీకేజీ, వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి. వ్యాధులు ప్రబలే అవకాశమున్న చోట దోమల నివారణకు చర్యలు చేపట్టాలి. కానీ ఆయా శాఖల సమన్వయ లోపంతో పారిశుద్ధ్య పనులు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. ఎవరికి వారు తమకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తుండటంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు.

కొనసాగుతున్న ఫీవర్ సర్వే

డెంగీ కేసుల వివరాలు	
సంవత్సరం	సంఖ్య
2020	13
2021	39
2022	161
2023	62
2024	116
2025 ఇప్పటి వరకు	28

జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఫీవర్ సర్వేను 820 టీంలతో చేపడుతున్నారు. ఇప్పటికే రెండు విడతల్లో సర్వే పూర్తికాగా మూడో విడత ఇంటింటి సర్వే కొనసాగుతోంది. జూన్ 5 నుంచి 28వ తేదీ వరకు 2.51లక్షల గృహాల్లో సర్వే నిర్వహించగా 1,632 మందికి జ్వరాలు వచ్చాయని గుర్తించారు. రెండో విడత జూలై 29 నుంచి ఆగస్టు 17వ తేదీ వరకు చేపట్టగా 1,164 మందికి, ఆగస్టు 18 నుంచి ఇప్పటి వరకు సర్వే నిర్వహించగా 518 మంది జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వారికి వెంటనే మందులు అందజేస్తూ వారిని రోజూ పరిశీలిస్తున్నారు.

పరిశుభ్రత తప్పనిసరి



ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పూల కుండీలు, టైర్లు, కొబ్బరి బొండాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలి. ఇప్పటికే రెండు మార్లు ఫీవర్ సర్వే పూర్తి అయింది. మూడో విడత కొనసాగుతోంది. జ్వరం వస్తే వెంటనే ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలి. అర్హతలేని వైద్యులను సంప్రదించవద్దు.

– డాక్టర్ ధనరాజ్, డీఎంహెచ్‌ఓ

అర్జీలపై నివేదిక ఇవ్వండి


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హైమావతి

- ప్రతీ వినతిని పరిష్కరించాలి
- కలెక్టర్ హైమావతి

సిద్దిపేటరూరల్: ప్రజావాణిలో ప్రజలు అందించిన ప్రతి అర్జీని త్వరగా పరిష్కరించాలని, అలాగే అర్జీలపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించి సమస్య మళ్లీ పునరావృతం కాకుండా చూడాలన్నారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం 281 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఆర్‌ఓ నాగరాజమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు తొలగించండి

మాది బందారం గ్రామం. ఔటర్ రింగురోడ్డు నిర్మాణంలో భాగంగా గ్రామం మధ్యలో ఉన్న సీసీ రోడ్డును తొలగించారు. మళ్లీ రోడ్డు నిర్మాణం చేయకపోవడంతో వర్షాలకు పూర్తిగా గుంతలు ఏర్పడి వాహనదారులకు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయమై ఎన్నో సార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ఫలితం లేకుండా పోయింది. ఎలాగైనా అధికారులు స్పందించి తాత్కాలిక రోడ్డు నిర్మించి సమస్యను పరిష్కరించాలని బందారం గ్రామస్తులు కోరారు.

డంపింగ్ యార్డును తొలగించాలి

మాది తొగుట మండలం, వరదరాజులపల్లి గ్రామం. సిద్దిపేట మున్సిపాలిటీకి చెందిన చెత్తను తీసుకువచ్చి గ్రామ శివారులో వేస్తున్నారు. దీంతో నీటితో పాటు భూమలు కలుషితం అవుతున్నాయి. అలాగే బయోఎరువులు, బయోగ్యాస్ యూనిట్లు ఏర్పాటు చేశారు. వాటి నుంచి వెలువడే వ్యర్థ పదార్థాలను దిగువన ఉన్న కుంటలోకి వదులుతున్నారు. అందులోని చేపలు సైతం చనిపోతున్నాయి. ఇప్పటికైనా డంపింగ్ యార్డును తొలగించాలని వరదరాజులపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

ఉపకరణాలు అందించాలి

జిల్లాలో అర్హులైన దివ్యాంగులకు ఉపకరణాలను అందించాలని స్వేచ్ఛ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ దివ్యాంగులు ఉపకరణాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

కార్మికులకు ఇన్సూరెన్స్ చేయించండి

సిద్దిపేటరూరల్: పరిశ్రమల్లోని కార్మికులకు ఇన్సూరెన్స్ చేయించాలని కలెక్టర్ హైమావతి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమల ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని యువతకు ఉపాధి అందించడానికి పరిశ్రమల స్థాపన ఎంతో ముఖ్యమన్నారు. వివిధ పరిశ్రమలు నెలకొల్పడానికి దరఖాస్తు పెట్టుకున్న వాటిని పరిశీలన చేయాలన్నారు. పరిశ్రమల శాఖ అధికారి గణేశ్‌రామ్, ఎల్‌డీఎం హరిబాబు, పాల్గొన్నారు.

ఇళ్ల గ్రౌండింగ్‌లో వేగం పెంచాలి

ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్‌లో వేగం పెంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్‌పై ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ జూమ్ ద్వారా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్కింగ్ చేశాక బేస్‌మెంట్ వరకు నిర్మాణం కాని వారి వివరాలను తీసుకురావాలన్నారు. బేస్‌మెంట్ వరకు అయిన వాటిని ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన యాప్‌లో నమోదు చేసేలా పంచాయతీ కార్యదర్శులకు టార్గెట్ ఇవ్వాలన్నారు.


రహదారిపై రాస్తారోకో చేస్తున్న అఖిలపక్షం నాయకులు

అసెంబ్లీని ముట్టడిస్తాం

చేర్యాలను డివిజన్ చేయాల్సిందే

- సాధన సమితి జేఏసీ చైర్మన్ నరసయ్య పంతులు
- అఖిలపక్షం ఆధ్వర్యంలో రాస్తారోకో

కొండపాక(గజ్వేల్): చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని సాధన సమితి జేఏసీ చైర్మన్ వకులాభరణం నరసయ్య పంతులు హెచ్చరించారు. మండల పరిధిలోని వెలికట్ట శివారులో అఖిలపక్షం ఆధ్వర్యంలో సోమవారం రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజానీకం వివిధ సమస్యల పరిష్కారం కోసం హుస్నాబాద్, గజ్వేల్, సిద్దిపేట, జనగామ తదితర పట్టణాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. దీంతో దూరభారంతోపాటు ఆర్థిక భారం తప్పడంలేదన్నారు. చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలంటూ ఎనిమిదేళ్లుగా పోరాటం చేస్తున్నామన్నారు. అయినా పాలకులు స్పందించడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చని పక్షంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతామన్నారు. రహదారిపై సుమారు 25 నిమిషాల పాటు రాస్తారోకో కొనసాగడంతో రోడ్డుకు ఇరువైపులా సుమారు 2 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు జోక్యం చేసుకుని రాస్తారోకోను విరమింపజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆముదాల మల్లారెడ్డి, బాల్‌నర్సయ్య, యాదగిరి, శ్రీధర్‌రెడ్డి, సంతోష్, రవీందర్, పద్మ, శోభ, మానస, మల్లేశం, కర్ణాకర్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ చీఫ్ దిష్టిబొమ్మ దహనం

బెజ్జంకి(సిద్దిపేట): బీజేపీ నాయకులు పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం బెజ్జంకిలో దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దొంగ ఓట్లతో గెలిచారని అనడం అవివేకమని, ప్రజలకు తక్షణం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లేశం, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.


మహేష్‌గౌడ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నేతలు

ఆశలపై ఇసుక మేటలు

వర్షాలతో భారీ నష్టం

మైదానాలను తలపిస్తున్న వేలాది ఎకరాలు

పరిహారం కోసం రైతుల వినతి

వర్గల్(గజ్వేల్): ఇటీవల కురిసిన వర్షాలు రైతులను తీవ్ర నష్టాల్లోకి నెట్టేసింది. వర్గల్ మండలంలో ఒక్క రోజే 23.6 సెంటీమీటర్ల కుంభవృష్టి కురవడం గమనార్హం. వర్షం తీవ్రతకు వరిపొలాలు దెబ్బతినగా, వరద ఉధృతికి పొలాలన్నీ ఇసుక మేటలయ్యాయి. పంటలను కోలుకోకుండా చేశాయి. ఎన్నెన్నో ఆశలతో సాగుచేసిన పైర్లు ఊహించని అతిభారీ వర్షంతో దెబ్బతిన్నాయి. వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం మండలంలో 3,392 ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయ పంటలకు నష్టం వాటిల్లింది. ఇటీవల నాట్లు వేసిన వరిపైర్లు సైతం పూర్తిగా ధ్వంసమయ్యాయి. గౌరారం, వేలూరు, అంబర్‌పేట, అనంతగిరిపల్లి, మజీద్‌పల్లి, గోవిందాపూర్, జబ్బాపూర్, సింగాయపల్లి, తదితర గ్రామాల్లో పైర్లు కొట్టుకుపోయి ఇసుకమేటలు వేశాయి. మేటలు తొలగించే అవకాశం లేక, ఇప్పటికిప్పుడు మళ్లీ సాగు చేసే అవకాశంలేక రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మజీద్‌పల్లి, అంబర్‌పేట తదితర గ్రామాలలో వరిపొలాలు ఇంకా నీటిలోనే మునిగి ఉన్నాయి. నీరు నిలిచి పత్తి పత్తిపైరు దెబ్బతిన్నది. మొక్కజొన్న, కూరగాయలు సాగుచేసిన రైతులదీ అదే పరిస్థితి. ప్రభుత్వ సాయం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రాథమిక అంచనాలతోనే సరి

ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో పంట నష్టం ప్రాథమిక అంచనాలకే పరిమితమైంది. వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం 2,945 ఎకరాల్లో వరి, 237 ఎకరాల్లో పత్తి, 81 ఎకరాల్లో మొక్కజొన్న, 129 ఎకరాల్లో కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన తరువాత రైతుల వారీగా పంట నష్టం వివరాలు సేకరిస్తామని ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.


అనంతగిరిపల్లిలో ఇసుకమేట వేసిన వరిపొలంలో దిగాలుగా రైతు పెంటయ్య


మజీద్‌పల్లిలో ఇసుకమేటలతో మైదానాన్ని తలపిస్తున్న వరి పొలాలు

అంతా ఇసుక మేటనే

మాది అనంతగిరిపల్లి. ఎకరంన్నర పొలంలో వరి వేశాను. భారీ వర్షం పొలాన్ని ఆగమాగం చేసింది. వరదకు ఇసుక కొట్టుకొచ్చి పొలంలో మేటలు వేసింది. పంటనే కనపడకుండా పోయింది. ప్రభుత్వం పరిహారం అందించి భరోసాగా నిలవాలి.

– తుమ్మల పెంటయ్య (రైతు, అనంతగిరిపల్లి)

పంటంతా పోయింది.. పెట్టుబడి నీటి పాలైంది



వానకాలం ఎకరా ముప్పావు (1.30 ఎకరాలు) పొలంలో సన్నవడ్లు వేశాను . రూ.40వేల దాకా పెట్టుబడి అయింది. మొన్నటి ఆదివారం రాత్రి ఎన్నడూ పడనంతా వాన కురిసింది. వరద తాకిడికి చేను చిందరవందరైంది. పొలం అంతా ఇసుక మేటలే. ప్రభుత్వం పంట నష్టానికి పరిహారమందించి ఆదుకోవాలి.

– కుర్నపల్లి శంకర్‌రెడ్డి (రైతు, గౌరారం)

క్లుప్తంగా

బైబిల్ హౌస్ ప్రారంభం



ప్రారంభిస్తున్న రూబెన్‌మార్క్

మెదక్‌జోన్: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ సీఎస్‌ఐ చర్చి ప్రాంగణంలో సోమవారం మాడరేటర్ ప్రొఫెసర్ రూబెన్‌మార్క్ బైబిల్ హౌస్‌ను ప్రారంభించారు. ఇందులో అన్ని భాషల్లో ఉన్న బైబిళ్లు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో చర్చి ప్రెసిబెటరి ఇన్‌చార్జి శాంతయ్య, గంట సంపత్ తదితరులు ఉన్నారు.

కరాటేలో విద్యార్థి ప్రతిభ



మెడల్ అందుకుంటున్న హర్షవర్ధన్

దుబ్బాకటౌన్: హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో బొమ్మక్ శంకరయ్య కన్వెన్షన్‌లో ఆదివారం రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో దుబ్బాకకు చెందిన యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ విద్యార్థి వేముల హర్షవర్ధన్ పాల్గొని గోల్డ్ మెడల్ సాధించి సత్తా చాటాడని కరాటే మాస్టర్ శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌కు సైతం నిర్వాహకులు బెస్ట్ కోచ్ అవార్డు అందించారు. ఇరువురిని నిహాన్ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆర్గనైజేషన్ ఇండియా వ్యవస్థాపకుడు రవీందర్, రేంజుకి షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ వ్యవస్థాపకుడు మాస్టర్ నగేశ్, అధ్యక్షుడు అశోక్, జనరల్ సెక్రటరీ నవీన్ కుమార్, సురేందర్, సిద్ధార్థ్ అభినందించారు.

అడవి పందుల బీభత్సం

పంటలు ధ్వంసం



చేనును పరిశీలిస్తున్న ఏఈఓ శ్రీలత, రైతు భాస్కర్

అక్కన్నపేట(హుస్నాబాద్): పంటలను అడవి పందులు ధ్వంసం చేశాయి. మండలంలోని రామవరం గ్రామ పరిధిలోని బంగారు లొద్ది తండా, సేవాలాల్ మహారాజ్ తండాలో సుమారు 13మంది రైతులు సాగుచేసిన మొక్కజొన్న, ఇతర పంటలపై పందులు దాడి చేశాయి. సోమవారం వ్యవసాయ విస్తరణాధికారి శ్రీలతతోపాటు ఫారెస్టు అధికారులు పంటలను పరిశీలించారు. నష్టపోయిన పంటల వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. అనంతరం రైతులు మాట్లాడుతూ.. ప్రస్తుతం చేను కంకి దశలో ఉందన్నారు. చేను చుట్టూ వల, చీరలు కట్టి.. రాత్రి కాపలా ఉన్నా కూడా పంటపై దాడి చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని పలువురు రైతులు కోరారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

నర్సాపూర్: రోజువారి ప్రణాళికతో చదివి మెరుగైన ఫలితాలు సాధించాలని రాష్ట్ర ఇంటర్మీడియెట్ బోర్డు ప్రత్యేక పరిశీలకుడు కిషన్ విద్యార్థులకు సూచించారు. ఆయన సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. వంద శాతం ఫలితాలు సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు. కాగా కాలేజీకి చెందిన పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పలు అంశాలను ప్రిన్సిపాల్ శేషాచారి ఆయనకు వివరించారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు విద్యార్థులు



విద్యార్థులతో ప్రిన్సిపాల్, పీడీ

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటారు. మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో మొదటి స్థానంలో నిలిచారు. త్వరలో హైదరాబాద్‌లో జరగబోయే రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. ఈ నెల 24, 25 తేదీల్లో ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేటలో జరిగిన జిల్లా స్థాయి త్రోబాల్ పోటీల్లో విద్యార్థుల జట్టు మొదటి స్థానంలో నిలిచింది. జట్టుకు రూ. 10 వేల నగదు, ట్రోఫీ, ప్రశంసా పత్రాలు అందజేశారు. నాలుగో స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 3 వేల నగదు, సర్టిఫికెట్లు అందజేశారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

న్యాల్‌కల్(జహీరాబాద్): నలుగురు పేకాట రాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ సుజిత్ కథనం ప్రకారం... హద్నూర్ గ్రామ శివారులో గ్రామానికి చెందిన కొందరు పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం దాడి చేశారు. దాడిలో పట్టుబడిన నలుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.3980 నగదు, పేకాట ముక్కలు, రెండు ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

భవితకు 'నవోదయం'

ఆరో తరగతిలో ప్రవేశాలకు ఆహ్వానం

- రేపే దరఖాస్తుల స్వీకరణకు తుది గడువు
- డిసెంబర్ 13న ప్రవేశపరీక్ష



వర్గల్ నవోదయ విద్యాలయం

వర్గల్(గజ్వేల్): ఆశ్రమ వసతులు, క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యకు మారుపేరుగా నవోదయ విద్యాలయాలు నిలుస్తున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లా వర్గల్ నవోదయలో 2026–27విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి డిసెంబర్ 13న ఎంట్రెన్స్ టెస్ట్ జరగనుంది. ఇందుకు విద్యార్థుల నుంచి ఈ నెల 27 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం 1987లో ఉమ్మడి జిల్లాలోని వర్గల్‌లో నవోదయ విద్యాలయం ఏర్పాటు చేసింది. ఆంగ్లం, తెలుగు, హిందీ త్రిభాషా సూత్రం ప్రాతిపదికన జాతీయ సమైక్యతకు బాటలు వేస్తున్నది. గ్రామీణ విద్యార్థుల ఉజ్వల భవితకు సోపానంగా నిలుస్తోంది. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాకులు, బాల బాలికలకు వేర్వేరు డార్మెటరీలు, టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్‌కు క్వార్టర్లు వంటి వసతులు ఉన్నాయి. అంతర్గత సీసీరోడ్లు, స్ట్రీట్‌లైట్లు, ఆరోగ్యాన్ని పంచే హరిత సంపద, సుశిక్షితులైన అధ్యాపక గణం, స్మార్ట్ క్లాసులు, సైన్స్, మ్యాథ్స్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, ఆటలకు బాసటగా విశాలమైన స్టేడియం, బాస్కెట్‌బాల్ తదితర మైదానాలు, జిమ్, హెల్త్ సెంటర్‌లతో నవోదయ ప్రత్యేకతను చాటుతుంది. ఇక్కడ పుస్తకాలు, దుస్తులు సహా విద్యార్థులకు అన్నీ ఉచితమే. ఇక్కడ ఆరు, ఏడు తరగతులు మాతృభాషలో, ఎనిమిదో తరగతి నుంచి ఆంగ్లంలో విద్యాబోధన చేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



2026–27 విద్యా సంవత్సరం ఆరో తరగతి ప్రవేశానికి డిసెంబర్ 13న ఎంట్రెన్స్ పరీక్ష జరగనుంది. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 27 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ఫారాన్ని వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. వివరాలు పూరించి, హెచ్ఎం సంతకంతో ఆన్‌లైన్‌లో గడువులోగా అప్‌లోడ్ చేయాలి. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

\- రాజేందర్, ప్రిన్సిపాల్, వర్గల్ నవోదయ

27 వరకు దరఖాస్తుల స్వీకరణ

వర్గల్ నవోదయలో ప్రవేశానికి డిసెంబర్ 13న ఎంట్రెన్స్ పరీక్ష జరగనుంది. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 27వరకు ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవోదయ.గవ్.ఇన్ ద్వారా దరఖాస్తులు అప్‌లోడ్ చేయవచ్చు. అర్హత పరీక్షలో ప్రతిభ ఆధారంగా నవోదయలో ఆరో తరగతిలో ప్రవేశం కల్పిస్తారు.

అభ్యర్థుల అర్హతలు

ప్రస్తుత విద్యా సంవత్సరం ఉమ్మడి మెదక్ జిల్లాలోని ప్రభుత్వ లేదా సర్కారు గుర్తింపు పొందిన పాఠశాలలో ఐదో తరగతి చదువుతుండాలి. వరుసగా 3,4,5 తరగతులు ఒకే పాఠశాలలో చదివి ఉండాలి. మే 1, 2014 – జూలై 31, 2016 మధ్య జన్మించి ఉండాలి.

కుల రహిత సమాజానికి వీహెచ్‌పీ కృషి

రాష్ట్ర అధ్యక్షుడు నరసింహమూర్తి

తొగుట(దుబ్బాక): హిందూ సమాజంలో కులాలను రూపుమాపి, కుల రహిత సమాజ నిర్మాణం కోసం విశ్వహిందూ పరిషత్ కృషి చేస్తుందని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు బోజనపల్లి నరసింహమూర్తి అన్నారు. సోమవారం మండలంలోని తుక్కాపూర్‌లో సామాజిక సమరసత అభియాన్, వీహెచ్‌పీల ఆధ్వర్యంలో సుహాసిని మహిళా పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాజకీయ పార్టీల స్వార్థం కోసం కులాల పేరిట హిందూ సమాజంలో విభజన తీసుకువచ్చారని ఆరోపించారు. అసమానతలను తొలగించేందుకు బసవేశ్వరుడు, వీర బ్రహ్మేంద్రస్వామి ఎంతగానో కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో వికారాబాద్ అమ్మ భవానీమాత ఆశ్రమ పీఠాధిపతి శంకర్ స్వామిజీ, సంగారెడ్డి దుద్యాల ఆశ్రమ పీఠాధిపతి అంబికా శివ యోగి స్వామిజీ, భద్రాచలం గీతాశ్రమ పీఠాధిపతి విశ్వాత్మానందగిరి స్వామిజీ, వీహెచ్‌పీ అఖిల భారత కార్యదర్శి దేవుజీరావత్, నాయకులు మోహన్ రావు, ధనంజయ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషన్‌రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు నర్సింహులు, స్వామి పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. యువకుడు మృతి



నరేశ్

కౌడిపల్లి(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని 765డి జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి ప్రకారం.. హవేళిఘనపూర్‌కు చెందిన గుండ నరేశ్(27) హైదరాబాద్ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ రోజు బైక్‌పై వెళ్లి వస్తున్నాడు. సోమవారం నరేశ్ తన బైక్‌పై ఇంటికి వస్తుండగా కౌడిపల్లి ఎల్లమ్మగుడి సమీపంలోనికి రాగానే వెనక నుంచి హైదరాబాద్ సూరారానికి చెందిన లవ్‌లేష్‌శుక్ల తదితరులు కారులో వస్తూ ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో బైక్‌పై ఉన్న నరేశ్ కిందపడగా తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి మూడు నెలల క్రితమే పెళ్లి జరిగింది. మృతుని తండ్రి గతంలో చనిపోగా తల్లి, ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. పోషించే కొడుకు మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యుల రోదన అందరినీ కంటతడి పెట్టించింది.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ..

పటాన్‌చెరు టౌన్: వాహనం ఢీకొని మహిళ మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన వడ్డే లక్ష్మి (47) సోమవారం ఉదయం కూలి పనికి వెళ్లేందుకు ఇంటి నుంచి రోజు మాదిరిగానే బయలు దేరింది. హనుమాన్ ఆలయ సమీపంలో ఉన్న బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా పటాన్‌చెరు వైపు నుంచి సంగారెడ్డి వైపు వెళుతున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

63 లక్షల గంజాయి పట్టివేత

ఇద్దరి అరెస్ట్.. రెండు కార్లు స్వాధీనం



ఎండు గంజాయిని పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు

సంగారెడ్డి: ఆంధ్రా ఒడిశా బార్డర్ నుంచి రెండు కార్లలో గంజాయిని తరలిస్తుండగా సంగారెడ్డి డీటీఎఫ్ టీం పట్టుకుంది. సోమవారం కేసుకు సంబంధించిన వివరాలను మెదక్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జె.హరికిషన్ వెల్లడించారు. ఏవోబీ నుంచి గంజాయి మహారాష్ట్రకు వెళుతుందనే సమాచారంతో సంగారెడ్డి కంది మండలం చేర్యాల గేటు వద్ద కాపు కాసి మహారాష్ట్రకు చెందిన వాహనాలను ఆపి తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ కారును తనిఖీ చేస్తుండగా కారు డిక్కీలో, బాడీ కింద ప్రత్యేకమైన అరలు చేయించి గంజాయిని సరఫరా చేస్తున్నారు. ఒక కారులో 69.5 కేజీలు, మరో కారులో 53.3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు అబ్దుల్ వహాబ్ సయ్యద్, ఉమాకాంత్ సబర్‌ను అరెస్ట్ చేశారు. చాంద్ మహమ్మద్ అనే వ్యక్తి పరారీలో ఉన్నాడు. పెద్ద మొత్తంలో గంజాయిని పట్టుకున్న డీటీఎఫ్ సీఐ దుబ్బాక శంకర్, నజీర్ పాషా, సిబ్బంది, సంగారెడ్డి ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్ చంద్రను అభినందించారు.

వ్యాపారంలో నష్టం.. అప్పులు తీర్చేందుకు చోరీలు

దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

సంగారెడ్డి క్రైమ్: మహిళ మెడలోంచి బంగారం ఎత్తుకెళ్లిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం సంగారెడ్డి పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ సత్తయ్య గౌడ్ కేసు వివరాలు వెల్లడించారు. కొండాపురం గ్రామానికి చెందిన కొకుంట్ల ప్రభాకర్ (38) పట్టణంలోని వసంతనగర్ కాలనీల్లో నివాసం ఉంటూ, వృత్తిరీత్యా డీసీఎం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పట్టణంలోని ఓడీఫ్ కాలనీ, ద్వారక కాలనీకి చెందిన సండ హంసమ్మ ఈనెల 24న ఉదయం ఆరు గంటల సమయంలో తన ఇంట్లో ఉండగా గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి వచ్చి వృద్ధురాలిని మంచానికి కట్టేసి, మెడలోని బంగారం దోచుకెళ్లాడు. ఆదివారం పట్టణంలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా, బైక్‌పై వచ్చిన అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. కొన్ని నెలల క్రితం వ్యాపారంలో నష్టాలు వచ్చాయని, చేసిన అప్పులు తీర్చడానికి దొంగతనం చేశానని నిందితుడు పోలీసులకు తెలిపాడు. నిందితుని వద్ద నుంచి 5 తులాల బంగారం స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించారు.

భార్యాపిల్లలతో వ్యక్తి అదృశ్యం

సంగారెడ్డి క్రైమ్: భార్యాపిల్లలతో కలిసి ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేశ్ వివరాల ప్రకారం... పట్టణంలోని మంజీరానగర్‌కు చెందిన దొడ్ల దుర్గేశ్ (26), భార్య పావని వృత్తిరీత్యా కూలీ పనులు చేసుకుంటున్నారు. వీరికి 11 నెలల బాబు ఉన్నాడు. భార్యాభర్తలకు సంసార విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈనెల 23న ఉదయం ఇంటి నుంచి వెళ్లిన భార్యాభర్తలు తిరిగి రాలేదు. కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరో ఘటనలో మహిళ..

సంగారెడ్డి పట్టణంలోని రాజంపేట్‌కు చెందిన దున్నారం సాయి ప్రతాప్, భార్య(28) వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇంటి సామాగ్రి తెస్తానని ఈ నెల 22న మధ్యాహ్నం 2గంటల సమయంలో వెళ్లిన భార్య తిరిగి ఇంటికి రాలేదు. చుట్టు పక్కల వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

గీతంలో 160 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న గీతం విద్యార్థులు

పటాన్‌చెరు: భారతదేశం, నేపాల్‌లో లక్ష యూనిట్ల రక్తాన్ని సేకరించి, గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించాలని బ్రహ్మకుమారీస్ సంకల్పించారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. బ్రహ్మకుమారీలు (చందానగర్ శాఖ), సోషల్ సర్వీస్ వింగ్ (ఆర్ఈఆర్ఎఫ్), రెడ్ క్రాస్ సొసైటీల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని తెలిపారు. శిబిరంలో దాదాపు 160 మంది విద్యార్థులు రక్తదానం చేయగా, వీరికి బ్రహ్మకుమారీలు ప్రశంసా పత్రాలు అందజేశారు.

నీటి గుంతలో పడి యువకుడి మృతి



రాజు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఓ యువకుడు నీటి గుంతలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని పెద్దకోడూరులో సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... ఆనరాశి లక్ష్మి, సత్తయ్య దంపతుల కుమారుడు రాజు(20) కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయి గ్రామంలో తిరుగుతున్నాడు. ఈ క్రమంలో వాళ్ల ఇంటి సమీపంలోని నీటి గుంతలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. స్థానికులు గుర్తించి 108లో సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి సత్తయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... జీడిమెట్లకు చెందిన బసవరాజు (38) రెండు నెలల క్రితం ముత్తంగి సాయిప్రియ కాలనీకి వచ్చి కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. అయితే బసవరాజు రోజు మద్యం తాగుతున్నాడు. ఐదు రోజుల నుండి భార్యాభర్తల మధ్య సంసార విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 24న రాత్రి భార్యను కొట్టడంతో పిల్లలని తీసుకుని ఇస్నాపూర్‌లో ఉన్న తన అక్క జగదీశ్వరి ఇంటికి వెళ్లిపోయింది. సోమవారం ఉదయం భార్య ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తలుపు గడియపెట్టి ఉండటంతో కిటికీ నుంచి చూసింది. అప్పటికే భర్త ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

గజ్వేల్‌రూరల్: అక్రమంగా తరలిస్తున్న పశువులను పోలీసులు పట్టుకున్నారు. గజ్వేల్ సీఐ రవికుమార్, పశువైద్యశాఖ ఏడీ రమేశ్ వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌లోని అన్నవరం ప్రాంతం నుంచి ఓ కంటైనర్‌లో 89 పశువులను హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు సమాచారం వచ్చింది. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ శివారు పాతూరు కూరగాయల మార్కెట్ సమీపంలో పశువులను తరలిస్తున్న కంటైనర్‌ను పట్టుకున్నారు. ఇందులో 54గోవులు ఉండగా మిగతా 35 పశువులు ఉన్నట్లు గుర్తించారు. వాటిలో 5గోవులు, 2 పశువులు మృతి చెందాయి. పశువులను ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని లక్ష్మాపూర్‌లోగల గోశాలకు పంపించారు. ఒక డ్రైవర్ పారిపోగా, మరో డ్రైవర్‌తోపాటు క్లీనర్‌లను అదుపులోకి తీసుకున్నారు.

సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్ బీ, చిన్నారుల ప్రతిభకు పట్టం

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు పాఠశాలల వారీగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్స్ చివరి తేదీ సెప్టెంబర్ 10, 2025

కేటగిరీ-1లో 1,2 తరగతులు, కేటగిరీ-2లో 3,4 తరగతులు, కేటగిరీ-3లో 5,6,7 తరగతులు, కేటగిరీ-4లో 8,9,10 తరగతుల వారికి. కేటగిరీల వారీగా బహుమతులతో పాటు చాంపియన్ స్కూల్ ట్రోఫీ, విజేతలకు మెడల్స్, పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారు.



సాక్షి స్పెల్‌బీకి నాలుగు రౌండ్లు, నాలుగు కేటగిరీలు
మొదటి రౌండ్ పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలోనే జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్ (క్వార్టర్ ఫైనల్స్) మూడో రౌండ్ (సెమీ ఫైనల్స్) నాలుగో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి.



సాక్షి మ్యాథ్ బీకి మూడు రౌండ్లు, నాలుగు కేటగిరీలు
మొదటి రెండు రౌండ్లు పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలో జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్‌లో సెమీ ఫైనల్స్, మూడో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి. మొదటి రౌండ్ తప్ప మిగతా రౌండ్స్ సాక్షి నిర్ణయించిన వేదికల్లో జరుగుతాయి.

విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తారు

రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 250. మరిన్ని వివరాల కోసం.. (ఉ.10 గం.ల నుంచి సా. 6 గం.ల మధ్య సంప్రదించగలరు)

www.arenaoneschoolfest.com వెబ్‌సైట్లో సంప్రదించవచ్చు.
040- 23256134 / 9505551099 / 9705199924 కు కాల్ చేయవచ్చు.

వైద్యుల పర్యవేక్షణలో చిన్నారులు

72 గంటల పాటు అబ్జర్వేషన్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

నర్సాపూర్: చుంచెలుక పడిన నీళ్లు తాగి అస్వస్థతకు గురైన చిన్నారులు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శివ్వంపేట మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కేంద్రంలో ఈనెల 23న ఎలుక పడిన నీళ్లు తాగి ఎనిమిది మంది చిన్నారులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. కాగా వారిలో రిషివర్ధన్‌కు కడుపు ఉబ్బడంతో అతన్ని ఆదివారం మెదక్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆస్పత్రికి పంపించారు. స్థానిక ఆస్పత్రిలో ఉన్న ఏడుగురిలో అక్షిత్ సోమవారం ఉదయం వాంతి చేసుకున్నాడు. 72గంటల అబ్జర్వేషన్‌లో ఉంచామని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పావని, ఆర్ఎంఓ రాజేశ్‌కుమార్ తెలిపారు. మిగతా చిన్నారులు కోలుకుంటున్నారని చెప్పారు. చికిత్స పొందుతున్న చిన్నారులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ పరామర్శించారు. ఆయన వెంట పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్న రమేశ్ గౌడ్, నాయకులు పెద్ద రమేశ్ గౌడ్, నారాయణరెడ్డి, చంద్రయ్య, బాల్‌రాజ్, రాజు, రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న దివం బహుమతి

నర్సాపూర్: హాస్టళ్లలో వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ అండ్ కాలేజీల ప్రాంతీయ సమన్వయ అధికారి దివం బహుమతి సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజీలో ఉమ్మడి మెదక్ జిల్లాలోని మైనారిటీ పాఠశాలలు, కాలేజీల ప్రిన్సిపాల్స్‌తో నిర్వహించిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలలు, కాలేజీల పరిసరాలు శుభ్రంగా ఉండేందుకు ప్రభుత్వం నిర్దేశించిన స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసిజర్ నిబంధనలు పాటించాలన్నారు. మెనూ పాటించాలని, విద్యా విధానాలు, డైనింగ్ విధానాలను ప్రిన్సిపాల్స్ నిరంతరం పరిశీలించాలని సూచించారు. సమావేశంలో విజిలెన్స్ అధికారులు మహ్మద్‌గౌస్, జగదీశ్వర్‌రెడ్డి, అకడమిక్ కోఆర్డినేటర్ వసీమోద్దీన్, స్థానిక పాఠశాల కాలేజీ ప్రిన్సిపాల్ నసీమా షేక్ పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడిన లారీ

జాతీయ రహదారిపై ట్రాఫిక్



లారీని క్రేన్ సాయంతో తొలగిస్తున్న పోలీసులు

పటాన్‌చెరు టౌన్: ఉల్లి లోడ్‌తో వెళుతున్న లారీ బోల్తా పడింది. వివరాలు ఇలా.. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని జయ బాలాజీ గార్డెన్ సమీపంలో సోమవారం జాతీయ రహదారిపై సంగారెడ్డి వైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఉల్లి లోడ్ లారీ డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో లారీలో ఉన్న ఉల్లి మూటలు జాతీయ రహదారిపై పడ్డాయి. ఆరు కిలోమీటర్ల మేర రుద్రారం వరకు ట్రాఫిక్ స్తంభించింది. ట్రాఫిక్ సీఐ లాలు నాయక్, సిబ్బందితో కలిసి క్లియర్ చేశారు. ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్‌ను వాహనదారులు డివైడర్ దాటించి పంపించారు. సంగారెడ్డి ట్రాఫిక్ పోలీసులు, కంది వైపు నుంచి వచ్చే వాహనాలను ఇతర దారుల గుండా మళ్లించారు.

పన్నులతో బీడీ పరిశ్రమ కుదేలు

రాష్ట్ర అధ్యక్షుడు గోపాలస్వామి

రామాయంపేట(మెదక్): బీడీ పరిశ్రమ పరిరక్షణకు కార్మికులు ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని తెలంగాణ బీడీ మరియు సిగార్ వర్కర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపాలస్వామి పిలుపునిచ్చారు. సంక్షోభం దిశగా బీడీ పరిశ్రమ– కేంద్రం విధి విధానాలు అనే అంశంపై సోమవారం స్థానిక ఫంక్షన్‌హాలులో జరిగిన సెమినార్‌లో పాల్గొని మాట్లాడారు. మినీ సిగరేట్లు తయారు చేస్తున్న కార్పొరేట్ పరిశ్రమలను పరిరక్షించడానికే కేంద్రం బీడీ పరిశ్రమను సంక్షోభంలోకి నెడుతుందని ఆరోపించారు. లక్షలాది మంది కార్మికులకు ఉపాధి చూపుతున్న బీడీ పరిశ్రమపై జీఎస్టీ పేరుతో అదనంగా పన్నులు విధించడంతో, భారాన్ని మోయలేక పరిశ్రమ కుదేలవుతుందన్నారు. కార్యక్రమంలో వికలాంగుల జాతీయ హక్కుల వేదిక రాష్ట కార్యదర్శి అడివయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం, జిల్లా అధ్యక్షురాలు మంజుల, జిల్లా కార్యదర్శి బాలమణి పాల్గొన్నారు.

తుఫాన్‌లో చెలరేగిన మంటలు



ఆలయం వద్ద కాలిపోతున్న వాహనం

పటాన్‌చెరు టౌన్: తుఫాన్ వాహనంలో మంటలు చెలరేగి పాక్షికంగా కాలిపోయింది. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు, స్థానికుల వివరాల ప్రకారం... మెదక్ జిల్లా రేగోడు మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన 12 మంది సోమవారం బీరంగూడలోని ఓ వేడుకకు వెళ్తున్నారు. కాగా, స్వామివారిని దర్శించుకునేందుకు వాహనాన్ని గణేశ్ దేవాలయ ఆవరణలో నిలిపి లోపలికి వెళ్లారు. ఈ లోపు వాహనంలో మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో దేవస్థానం సిబ్బంది నీటితో మంటలను అదుపు చేశారు. అయినా అప్పటికే వాహనం పాక్షికంగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాలేదు.